# బడి బయట ఎందుకు..?

- బడిఈడు పిల్లలపై విద్యాశాఖ ముమ్మర సర్వే
- జనవరి చివరి వరకు వివరాల సేకరణ
- ప్రతి విద్యార్థికి విద్యనందించాలని ఆదేశం

**మానవపాడు :** విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు అందిస్తున్నా కొన్ని పరిస్థితుల కారణంగా కొందరు పిల్లలు పాఠశాలలకు వెళ్లకుండా ఇళ్ల వద్దే ఉంటున్నారు. మరికొందరు బడి మానేసి ఇతర పనులకు వెళ్తున్నారు. ప్రాథమిక విద్య పూర్తి చేసిన అనేక మంది ఉన్నత చదువులకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బడి బయట పిల్లల వివరాలను సేకరించి వారికి అనేక మార్గాల ద్వారా విద్యనందిస్తోంది. పిల్లలు ఎక్కడ ఉంటే అక్కడే విద్యనభ్యసించేలా విద్యాశాఖ ప్రణాళికలు చేపట్టింది. అందుకు అనుగుణంగా విద్యాశాఖ అధికారులు బడిబయట పిల్లల వివరాల సేకరణకు శ్రీకారం చుట్టారు.

**నెలాఖరు వరకు వివరాల సేకరణ..**

సంక్రాంతికి ముందే బడి బయట పిల్లల సర్వే చేపట్టాల్సింది ఉంది. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో పిల్లల వివరాలు సేకరణ పోర్టల్లో నమోదు కాలేదు. సమ్మె విరమణతో జిల్లా విద్యాశాఖ సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సిబ్బంది సంక్రాంతి సెలవుల అనంతరం బడిఈడు పిల్లల వివరాల కోసం సర్వే ప్రారంభించారు. మండలంలో ఇప్పటికే 19 మందిని పాఠశాలల్లో చేర్పించారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలతో పాటు అర్ధాంతరంగా బడి మానేసిన వారిలో 18 మందిని, 15 నుంచి 19 ఏళ్లలోపు వారిలో ఒక్కరిని గుర్తించి పాఠశాలలో చేర్పించారు.

**ఇంటింటా సర్వే..**

సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. బడి మానేయడానికి గల కారణాలు తెలుసుకుంటూ చదువు ప్రాధాన్యత, ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత కూడా అవగాహన కల్పిస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పిల్లల వివరాలు ప్రభుత్వం రూపొందించిన ప్రబంధ పోర్టల్లో నమోదు చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ వరకు సీఆర్పీలు సర్వే వివరాలు ఎంఈఓలకు అందించాలి. బడిఈడు పిల్లలను గుర్తించిన అనంతరం వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించడానికి విద్యా శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.


మానవపాడులో సర్వే చేస్తున్న సీఆర్పీ(ఫైల్)

**అవగాహన కల్పించాలి..**



గ్రామాల్లో ఎక్కడెక్కడ విద్యార్థులు పనుల్లో ఉన్నారో సీఆర్పీలు గుర్తించాలి. విద్య ప్రాముఖ్యత, బాల కార్మికుల నిర్మూలనపై అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. చదువుతోనే విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని, బడిఈడు పిల్లల సర్వే ప్రాముఖ్యతపై విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించాలి.

– ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచ్ కలుకుంట్ల

**పకడ్బందీగా సర్వే..**



గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే ముమ్మరంగా సాగుతోంది. సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ప్రబంధ పోర్టల్లలో నమోదు చేస్తున్నాం. సర్వేలో గుర్తించిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడానికి సన్నాహాలు చేస్తున్నాం. బడిఈడు పిల్లల వివరాలు సీఆర్పీల దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరుతున్నాం.

– శివప్రసాద్, ఎంఈఓ

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఉండవెల్లి :** మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి ఉండవెల్లికి వెళ్తున్న షేక్ సలీం బాషా(72)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలైన విషయం విధితమే. బాషా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం మృతుడి కుమారుడు అబ్దుల్ రెహమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

**వివాహిత మృతి.. కేసు నమోదు**

మండలంలోని శేరుపల్లే గ్రామంలో శిరీషా(19) ఈనెల 26న క్షణికావేశంతో పురుగుల మందును తాగి మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. బుధవారం మృతురాలి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**మల్దకల్ :** మండలంలోని సద్దలోనిపల్లి గ్రామానికి చెందిన లవన్నను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం సద్దలోనిపల్లి స్టేజీ సమీపంలో బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో లవన్న తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**అలంపూర్ :** అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన మహేష్ ఎలాంటి అనుమతులు లేకుండా బుధవారం తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపురం వద్ద ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### ఎండు మిర్చిని తగులబెట్టిన దుండగులు



**అయిజ :** మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామ శివారులో బుధవారం ఎండుమిర్చి పంటను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. గ్రామానికి చెందిన బార్కి భీమన్న మార్కెట్‌కు తరలించేందుకు మిర్చిని బస్తాల్లో నింపారు. ఇంటికి వెళ్లి పొలం వద్దకు తిరిగి రాగా మంటల్లో మిర్చి బస్తాలు కాలిపోతుండగా చుట్టుపక్కల రైతులతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రమాదంలో సుమారు 10 క్వింటాళ్ల ఎండు మిర్చి కాలిపోయింది. ఘటనపై తహసీల్దార్ జ్యోతికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని బాధిత రైతు అధికారులను కోరుతున్నాడు.

### నయబ్ తహసీల్దార్‌కు సన్మానం



**కేటీదొడ్డి:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ఉదయ్‌కుమార్ పదోన్నతిపై జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయానికి నయబ్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కార్యాలయంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు, శ్రీపాద రెడ్డి, తిమ్మప్ప, వాచ్యానాయక్, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

### పోస్టల్ సేవలు ఉపయోగించుకోవాలి



**ఉండవెల్లి:** పోస్టల్ సేవలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని పోస్టుమాస్టర్ సుజాత అన్నారు. మండల పరిధిలోని తక్కశీల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఇన్సురెన్స్, బేటీ పడావో బేటీ బచావో, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 8 మంది విద్యార్థులకు అకౌంట్లు ఓపెన్ చేయించినట్లు ప్రధానోపాధ్యాయుడు అనితాబాయ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్ రెడ్డి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

## ‘అక్రమార్కుడిపై చర్యలు తీసుకోవాలి’


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి

**శాంతినగర్ :** భూములు, ప్లాట్ల దందాలు, వివిధ అక్రమాలకు పాల్పడుతున్న ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని అలంపూర్ మాజీ శాసనసభ్యుడు కొత్తకోట ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని గడ్డం శ్రీనివాసులు గృహంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యేలు అబ్రహం, సంపత్‌కుమార్‌ల అండదండలతో సీతారామిరెడ్డి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్నాడన్నారు. రామాపురం గ్రామానికి చెందిన జహంగీర్ బాషకు చెందిన 2.32 ఎకరాల భూమిని రూ.6 లక్షలకు సీతారామిరెడ్డి అక్క పేరిట ఫుల్ రిజిస్ట్రర్ చేయించుకుని ఆయనకు తెలియకుండా ఇతరులకు ఎకరా రూ.15 లక్షలకు అమ్ముకుని సొమ్ముచేసుకున్నాడని ఆరోపించారు. పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేస్తే పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో వారిపై కేసు పెట్టినట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అండదండలతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అదే విధంగా తనగల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎకరన్నరం స్థలాన్ని సీతారామిరెడ్డి ప్లాట్లు చేసి అమ్మేశారన్నారు. తనగల గ్రామంలోని డ్వాక్రా భవనం 2014 నుంచి ఇప్పటి వరకు సీతారామిరెడ్డి ఆధీనంలో ఉందన్నారు. డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేసినా ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి సీతారామిరెడ్డి అరాచకాలపై ఫిర్యాదు చేసినా బాధితులకు న్యాయం జరగడం లేదని వాపోయారు. మద్దాచారి పొలంలో ఎకరం, పచ్చర్లలో మూడెకరాలు తన పలుకుబడితో బినామీలు, కుటుంబ సభ్యుల పేర్లపై రిజిస్ట్రర్ చేసుకున్నాడని ఆరోపించారు. తుమ్మిళ్ల లిఫ్ట్, ఆర్డీఎస్ నీటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, తనకు బాధ్యతలు అప్పగిస్తే రైతులకు పూర్తి స్థాయిలో నీరందేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాణిక్యం శ్రీనివాసులు, మాదన్న, చంద్రశేఖర్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ప్రత్యేక రక్షణకు షీటీం


మాట్లాడుతున్న షీటీం సభ్యులు

**అలంపూర్ :** మహిళల రక్షణ కోసం షీటీం ప్రత్యేకంగా పని చేస్తోందని షీటీం సభ్యులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో షీటీం బృందం బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం సేవలు ఆవశ్యకత, విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళలను వేధింపులకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. వేధింపులకు గురైన వారు షీటీం పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 70312 లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వేధింపుల్లోని రకాలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు దివ్యవాణి, లోకేశ్వరి, శేషన్న, హన్మంతు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

**ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు..**

గృహిణిని వేధింపులకు గురి చేసిన ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. మండలానికి చెందిన ఓ గృహిణిని ముగ్గురు ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తున్నట్లు షీటీంకు సమాచారం వచ్చిందని, షీటీం బృందం అలంపూర్‌లో నిఘా ఉంచి వేధింపులకు గురి చేస్తున్న ముగ్గురు ఆకతాయిలను షీటీం బృందం సభ్యులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

## ప్రమాదకర కల్వర్టులు మూసివేయాలి


కల్వర్టును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

**అయిజ :** మున్సిపాలిటీలో పలుచోట్ల కాలువలు, కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని మూసివేసి ప్రమాదాలు అరికట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీలను నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ నర్సింగరావుతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు వివరించారు. పెద్దవాగు సమీపంలో వాల్మీకి గుడి వద్ద కల్వర్టు ప్రమాదకరంగా ఉందని, అదే విధంగా కొత్త బస్టాండ్‌లో అనేక చోట్ల చౌరస్తాల వద్దా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డివైడర్ పూర్తిగా నిర్మించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రదీప్ కుమార్, పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, ఓబుల్ రెడ్డి, ఇబ్రహీం, రఘు, భీబన్న, పరుశ రాముడు, నాగరాజు పాల్గొన్నారు.

## పోషకాహార లోపాలు అధిగమిద్దాం


మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య

**గట్టు :** చిన్నారుల్లో పోషకాహార లోపాలు అధిగమించే విధంగా చర్యలు తీసుకుందామని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. బుధవారం మండల సమాఖ్య భవనంలో వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు పోషకాహార లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు చిన్నారులు పోషకాహార లోపాలతో ఉండకూడదన్నారు. పోషకాహార లోపం కారణంగా ఏ ఒక్క మరణం సంభవించకూడదని పేర్కొన్నారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, దాన్ని బయట పడేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో పని చేస్తున్న సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ కార్యదర్శులు ముందుకు సాగాలని కోరారు. చిన్న పిల్లల్లో మొదటి 1000 రోజులు చాలా ముఖ్యమైనవని మానసిక అభివృద్ధి వేగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రేతమ్మ, ఏపీఎం అన్నపూర్ణ, ఎంపీఓ రవికుమార్ తదితరులు ఉన్నారు.

### వైభవంగా గంధోత్సవం



**అలంపూర్ రూరల్ :** పట్టణంలోని గాంధీ చౌక్‌లో గల ఆమీనోద్దీన్ బాబా దర్గాలో బుధవారం రాత్రి గంధం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గంధానికి మేళతాలలతో ప్రత్యేక ప్రార్థనలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నిర్వహకులు ఖదీర్ ఆహ్మద్, ఖలీల్ ఆహ్మద్, ముస్తాఫ, షఫీ అమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐకు సన్మానం

**ధరూరు :** ఎస్ఐ శ్రీహరిని మండల పరిధిలోని మార్లబీడు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు దేవదాసు, స్వేరో మండల అధ్యక్షుడు సుధాకర్ నేతృత్వంలో దళిత సంఘం నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐను సన్మానించారు. కార్యక్రమంలో దేవదాసు, మారెప్ప, పెద్దింటి ఏసన్న, ఆదాము, సావరన్న, తదితరులు పాల్గొన్నారు.

### జాన్‌వెస్లీ ఎంపికపై కార్యకర్తల హర్షం



**రాజోళి :** సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా దళిత సామాజిక వర్గానికి చెందిన జాన్‌వెస్లీ ఎన్నిక కావడంపై పార్టీ కార్యకర్తలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. గతంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంలో పని చేసిన ఆయనకు సీపీఎం పార్టీ ఇచ్చిన కార్యదర్శి పదవితో పార్టీ తరఫున ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేస్తామని సీపీఎం, కేవీపీఎస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు తిప్పన్న, విజయ్‌కుమార్, సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, సంజన్న, దస్తగిరి, లక్ష్మిదేవి తదిదరులు పాల్గొన్నారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం

**మానవపాడు:** మండలంలోని పల్లెపాడు గ్రామంలో బుధవారం డీసీసీ జనరల్ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆదేశానుసారం గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

**వనపర్తి రూరల్:** మండలంలోని చిట్యాలకు చెందిన పోతుల భవ్యశ్రీ, బర్కం శ్రావ్యశ్రీ, సింగారపు ఝాన్సీ, పోతుల సిద్దార్థ కిక్ బాక్సింగ్, గోజురియో కరాటే పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని మాస్టర్ వరుణ్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు, మాస్టర్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పోతు శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌శెట్టి, రాజు, కురుమన్న తదితరులు పాల్గొన్నారు

## నిబంధనలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న అధికారులు

**మానవపాడు:** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, బైక్‌పై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని అసిస్టెంట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ అధికారులు సాయి శృతి, రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, తొందరపాటు తనంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. సైబర్ క్రైం, మోసాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ సమస్యపై గ్రామసభలో చర్చ


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, గ్రామస్తులు

**రాజోళి :** మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామంలోని పలు సమస్యలపై ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ గ్రామానికి ప్రత్యేకాధికారిగా ఉంటూ గ్రామంలోని సమస్యలు పట్టించుకోకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నించారు. గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తే, అందులో నర్సరీని ఏర్పాటు చేయక పోగా నర్సరీని రాజోళిలో ఏర్పాటు చేయడం తగదన్నారు. అనంతరం సంబంధిత స్థలాన్ని ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ పరిశీలించారు. దానికి సంబంధించిన సమస్యను రెవెన్యూ అధికారులతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


మాట్లాడుతున్న కమాండెంట్ సాంబయ్య

**ఎర్రవల్లి:** విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో చైర్మన్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌లైటిమెంట్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఆశయంతో చదివి ఉన్నత కొలువులు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. అదే విదంగా జబర్దస్త్ నటీనటులు కొమరక్క, సునామి సుధాకర్‌ల హాస్య కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు పాణి, శ్రీనివాస్, ఈసీజీ డైరెక్టర్ శివప్రసాద్, విద్యావేత్త సాంబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**మల్దకల్ :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దొడ్డి, మల్దకల్ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలన్నారు. ప్రతిరోజు మధ్యాహ్న భోజనాన్ని హెచ్‌ఎంలు పరిశీలించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, నాగరాజు, పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**అభ్యసన సామర్థ్యాలు పరిశీలన..**

**ధరూరు :** మండల పరిధిలోని నాగర్‌దొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలను మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు బుధవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి ఆహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిష్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు


నిరంజన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

**అలంపూర్ :** దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్ వారికి ఘన స్వాగతం పలికారు. జోగుళాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పూజలు..**

**ఎర్రవల్లి :** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని బుధవారం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య దంపతులు సందర్శించారు. మౌని అమావాస్యను పురస్కరించుకొని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు..**

**ధరూరు :** మండల పరిదిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు లాంఛనాలతో ఘన స్వాగతం పలికారు. మొక్కులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**డీఈఓ పూజలు**

**కేటీదొడ్డి:** శ్రావణ నక్షత్ర యుత మౌని అమావాస్య సందర్భంగా మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామిని బుధవారం జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి హంపయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.

## ‘పది’లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులతో ప్రియాంక, సునంద

**గద్వాలటౌన్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉర్దు ఉన్నత పాఠశాల, దౌదరపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ప్రియాంక పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఆయా పాఠశాలలకు వెళ్లి ప్రత్యేక తరగతుల తీరు తెన్నులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులతో పాటు స్లిప్ టెస్టులను నిర్వహించాలని సూచించారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

**బాలికల విద్య, ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం..**

దేశంలో అబ్బాయిల సంఖ్య కంటే అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉందని, బాలికల విద్య, ఆరోగ్య పరిరక్షణ, సమానత్వం అత్యంత అవసరమని జిల్లా మహిళా,శిశు సంక్షేమ అధికారిణి సునంద పేర్కొన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, డీహెచ్‌ఈడబ్ల్యూ నాగరాజు పాల్గొన్నారు.

## హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**కేటీదొడ్డి:** బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని ఎంవీఎఫ్ స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో తల్లుల సంఘం సభ్యులకు బాలల హక్కులు, బాల్య వివాహాలపై మదర్స్ అసోసియేషన్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. చిన్నారులు పనుల్లో కాదని బడుల్లో ఉండాలన్నారు. బాలలను పనుల్లో పెట్టుకుంటే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల హాజరు శాతం పెంచే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## ఉపాధి హామీ సిబ్బందిని విస్మరిస్తున్నారు

**రాజోళి :** ఉపాధి హామీ సిబ్బందికి ఇచ్చిన హామీలను మరచి ప్రభుత్వం తమ సేవలను విస్మరిస్తుందని ఉపాధి హామీ సిబ్బంది జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామలింగేశ్వర ప్రసాద్ అన్నారు. మంత్రి సీతక్క గతంలో ఉపాధి హామీ సిబ్బందికి పేస్కేల్ అమలు చేస్తామని చెప్పి నేటి వరకు చేయలేదన్నారు. దానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బంది చేపట్టిన నిరసనలో భాగంగా మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాల ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో పని దినాల కల్పన, కూలీలకు సౌకర్యాలు, అభివృద్ధి పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్న మా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.